ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 15-4-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కంచ గచ్చిబౌలిలో అటవీ, పర్యావరణ పరిరక్షణ నియమాలను రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘించిందని, ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు వాస్తవాలనే ఎత్తి చూపాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.
2. రాష్ట్రంలో పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిలో మహిళలకు భాగస్వామ్యం కల్పించి మహిళా సాధికారతకు దోహదం చేయటమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు.
3. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమ సంపాదనతో లాభపడ్డ నేతలే తమ ప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు
4. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం వజ్రోత్సవాలు ఈ రోజు ఘనంగా జరుగుతున్నాయి.

-----------------------

**Kishan Reddy:**

కంచ గచ్చిబౌలిలో అటవీ, పర్యావరణ పరిరక్షణ నియమాలను రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘించిందని  కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభిప్రాయ పడ్డారు.  హైదరాబాద్ లో కొద్ది సేపటి క్రితం విలేకరులతో ముచ్చటిస్తూ, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రభుత్వమే ఉల్లంఘనలకు పాల్పడిందని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రధాన మంత్రి నిన్న చేసిన వ్యాఖ్యల్లో తప్పులేదని, ఆయన వ్యాఖ్యలు వాస్తవాలనే ఎత్తి చూపాయని  అన్నారు.  నిర్మాణ కార్యకలాపాలు ఉధృతంగా జరుగుతున్న చోట భవిష్యత్ తరాల కోసం కొన్ని భూములు ఉంచాలని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో భూములు, మద్యం అమ్మకాలు, అప్పులు తేవటంలో గత BRS, ప్రస్తుత కాంగ్రెసు ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని ఆరోపించారు. హైదరాబాద్ లో ఇప్పటికే అభివృద్ధి చేసి, నిర్మించిన  భవనాలు అందుబాటులో ఉన్నాయని చెబుతూ, భూముల అమ్మకంతోనే ప్రభుత్వాలను నడపాలని ఆలోచించటం సరి కాదని కేంద్ర మంత్రి అన్నారు. వక్ఫ్ చట్టానికి సంబంధించి విమర్శలపై స్పందిస్తూ, వక్ఫ్ చట్టాలవల్ల ఒక్క పేద కుటుంబానికీ న్యాయం జరగలేదని, సవరించిన చట్టం వల్ల ఒక్కరికీ నష్టం లేదని అన్నారు. వక్ఫ్ ఆస్తుల్లో ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకూడదనేదే ప్రభుత్వ ఉద్దేశ్యమని వివరించారు.

**(MSL)**

---------------------------

**భట్టి విక్రమార్క- మహిళలు**

రాష్ట్రంలో పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిలో మహిళలకు భాగస్వామ్యం కల్పించి మహిళా సాధికారతకు దోహదం చేయటమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. హైదరాబాద్ లో ఏర్పాటయిన స్త్రీ సమ్మిట్ 2.0 కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేశంలో మహిళలకు విశిష్ట అధికారాలు, హక్కులు కల్పించటంలో, రాజకీయాల్లో వాటా కల్పించటానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ పునాదులు వేశారని అన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుందన్నారు. అందులో భాగంగా మొదటి ఏడాది లక్ష్యానికి మించి 21 వేల కోట్ల రూపాయిలు వడ్డీ లేని రుణాలు స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేసినట్లు చెప్పారు. రాబోయే నాలుగేళ్ళలో ఏటా 20 వేల కోట్ల రూపాయిల వడ్డీ లేని రుణాలు అందజేస్తామని చెప్పారు.

------------ **బైట్** ------------

**(MSL)**

-------------------

**పొంగులేటి**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమ సంపాదనతో లాభపడ్డ నేతలే తమ ప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి, ఇందిరమ్మ ప్రభుత్వానికి ప్రజలు మద్దతిచ్చారని చెప్పారు. ప్రభుత్వాన్ని

పడగొట్టాలని పలువురు కోరుతున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వారం నుంచే అధికార దాహంతో కూల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖర్ రావు సూచన మేరకు కొత్త ప్రభాకర్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారని అన్నారు. ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా బీఆర్ఎస్ పార్టీ తీరు మారలేదన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూల్చి గద్దెనెక్కాలని చంద్రశేఖర్ రావు, తారక రామారావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. ఇలాంటి ప్రయత్నాలకు తాము భయపడబోమని, తమ ప్రభుత్వాన్ని ఎవ్వరూ కూల్చలేరని మంత్రి స్పష్టం చేశారు.

**(డెస్క్)**

-------------------------

**కొత్త ప్రభాకర్ రెడ్డి-ఆది శ్రీనివాస్**

కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాన్ని పడగొట్టాలంటున్నారని, అవసరమైతే ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే ఖర్చును తాము భరిస్తామంటున్నారని దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఖండించారు. ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలను ప్రభుత్వాన్ని పడగొట్టాలనే యత్నాన్ని కుట్రకోణంగా భావిస్తున్నామని అన్నారు. దీనిపై విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరతామని చెప్పారు.

(డెస్క్)

------------------------

**సీఎం-భూ భారతి**

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తీసుకొచ్చిన 'భూ భారతి'ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెవెన్యూ యంత్రాంగాన్ని కోరారు. తెలంగాణలో వివాద రహిత భూ విధానాలు ఉండాలన్నదే ప్రభుత్వ ప్రయత్నమని స్పష్టం చేశారు. ఆధార్ తరహాలో భవిష్యత్తులో భూమికి సంబంధించి సర్వే చేసి కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో 'భూధార్' తీసుకొస్తామని ప్రకటించారు. భూ భారతి చట్టం, భూ భారతి పోర్టల్ ను నిన్న ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. పైలట్ ప్రాజెక్టుగా తొలి విడత భూ భారతిని నాలుగు మండలాల్లో చేపడుతామన్నారు.

(డెస్క్)

----------------------------

**BREAK**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ air news_hyd ను ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel ను సబ్ స్క్రైబ్ చేయండి.

-------------------------

**రాష్ట్ర ప్రభుత్వం**

భారత్ సమ్మిట్- 2025ను హైదరాబాద్ లోని హెచ్ఐసీసీలో ఈ నెల 25,26 తేదీలలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ సమావేశానికి 100కు పైగా దేశాల నుంచి 450 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. యావత్ దేశం అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఎదురుచూస్తున్న ఈ ప్రపంచ వేదికకు ఆతిథ్యం ఇవ్వడానికి హైదరాబాద్ సిద్ధమవుతోందని ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అన్నారు. ఈ సదస్సు న్యాయం, ప్రజాస్వామ్యం, సమానత్వం, శాంతి వంటి అంశాలపై ప్రపంచ భవిష్యత్తును పునర్నిర్మించేందుకు ఒక ప్రధాన వేదికగా నిలవనుందని ఒక సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొన్నారు. భారత్ సమ్మిట్ కు సంబంధించిన వీడియోను పంచుకున్నారు.

**(డెస్క్)**

---------------------------

**ఆకాశవాణి Hyderabad వజ్రోత్సవాలు:**

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం వజ్రోత్సవాలు ఈ రోజు ఘనంగా జరుగుతున్నాయి. హైదరాబాద్ సంస్థానంలో ప్రసారాలు అందించిన దక్కన్ రేడియో, 1950 లో ఇదే రోజు భారత ప్రభుత్వం అధీనంలోకి వచ్చి, ఆ తర్వాత ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంగా ప్రసారాలు కొనసాగించింది. గత ఏడున్నర దశాబ్దాలుగా తెలుగు, ఉర్దూ, కన్నడ, మరాఠీ సహా 7 భాషల్లో పిల్లలు, పెద్దలు, మహిళలు, కార్మికులు, విద్యార్థులు,

వయోజనులు.. ఇలా అన్ని వర్గాలకు రోజు దాదాపు 18 గంటలపాటు ప్రసారాలు అందిస్తోంది. తెలుగు రాష్ట్రాలకు, ముఖ్యంగా తెలంగాణా ప్రాంత ప్రజలకు నిరంతరం సమాచార, విద్యా, వినోద కార్యక్రమాలను ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రసారం చేస్తోంది. ఇక్కడి నుంచి ప్రసారం అయ్యే తెలుగు, ఉర్దూ వార్తలకు, కరెంట్ ఎఫైర్స్, సమకాలీన, సామాజిక- ఆర్థిక అంశాలపై విశ్లేషణలకు విశేష ప్రజాదరణ ఉంది. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా FM మాధ్యమంలో, నాలుగు లోకల్ రేడియో స్టేషన్లు, 10 ట్రాన్స్మిటర్ల సాయంతో సమాచార ప్రసారాలను ప్రజలకు చేరువ చేసింది. ప్రజా సేవా ప్రసారాలను మొబైల్ యాప్, సామాజిక మాధ్యమాల లో కూడా అందుబాటులో ఉంచింది. తెలుగు ఉర్దూ భాషల్లో ఎందరో సాహితీ, కళా రంగ ప్రముఖుల ప్రస్థానంలో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం తొలి మెట్టు అయింది. ఆకాశవాణి 75వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రగ్యా పాలివాల్ గౌర్ ఈ మధ్యాహ్నం ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో పైలాన్ ను దృశ్య మాధ్యమంగా ఆవిష్కరిస్తారు.

**(-MSL)**

----------------------------

**ఆకాశవాణి శ్రోత-సిరిసిల్ల**

తాను రేడియో ద్వారా ఎన్నో విషయాలను తెలుసుకుంటున్నానని, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రానికి చెందిన శ్రోత చిలుక ఆశాలు చెప్పారు.

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ఈరోజు 75 వ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు..

**(బైట్ చిలు ఆశాలు)**

**( పి టి సి, రాజన్న సిరిసిల్ల జిల్లా)**

------------------------

**ఆకాశవాణి-శ్రోత నిర్మల్**

గత 40 సంవత్సరాలు నుంచి తాను ఆకాశవాణి వార్తలు వింటున్నానని నిర్మల్ జిల్లాకు చెందిన శ్రోత హన్మాయి పోశెట్టి తెలిపారు. వ్యవసాయానికి సంబంధించిన విషయాలను ఆకాశవాణి ప్రసారాల ద్వారానే తెలుసుకుంటున్నానని చెప్పారు.

**(ఆకాశవాణి శ్రోత పోశెట్టి)**

**(పిటిసి నిర్మల్ జిల్లా)**

----------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో నేడు, రేపు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, గంటలకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో

కూడిన వర్షాలు జయశంకర్  భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, వికారాబాద్ జిల్లాల్లో అక్కడక్కడక కురిసే అవకాశం ఉందని పసుపు హెచ్చరిక జారీ చేసింది. రాబోయే 3 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి3 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

**(డెస్క్)**

------------------------

**ఎండ్**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.

----------------